వైభవంగా అంకాలమ్మ తల్లి కొలుపులు



ఉత్సవంలో వేషధారణలతో ఆకట్టుకున్న కళాకారులు



శిడిమాను ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

గురజాల: నగర పంచాయతీలోని సట్టు ప్రాంతంలో వేంచేసియున్న శ్రీ అంకాలమ్మ కొలుపుల మహోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. కొలుపులను పురస్కరించుకుని భక్తులు అంకాలమ్మ తల్లిని దర్శించుకుని తరించారు. మొక్కుబడులు ఉన్న వారు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. నగర పంచాయతీ పరిధిలోని ప్రజలు ఉత్సవంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అంకమ్మ తల్లిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదాన్ని అందించారు. శిడిమాను ఉత్సవం సాయంత్రం సమయంలో నిర్వహించిన ఉత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. దేవాలయం చుట్టు శిడిమాను ప్రదక్షిణలు చేసిన అనంతరం శిడిమానును గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. రైతులు పండించిన పంటలు, కూరగాయలతో శిడిమానును ప్రత్యేకంగా అలంకరించారు. వర్షాలు సంమృద్ధిగా పడాలని రైతులు ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ ఉత్సవాలు నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా పల్లెర్ల



పల్లెర్ల సత్య వెంకటరామిరెడ్డి

రెంటచింతల: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబానికి విధేయునిగా ఉంటూ వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి గ్రామంలో పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేస్తున్న రెంటచింతల గ్రామానికి చెందిన పల్లెర్ల సత్య వెంకటరామిరెడ్డి(రాంబాబు)ను పార్టీ కార్యదర్శిగా పార్టీ అధిష్టానం ఎంపిక చేయడంపై మండల పార్టీ శ్రేణులు ఆదివారం హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత విద్యావంతుడు, ప్రముఖ బిల్డర్ అయిన వెంకటరామి రెడ్డి సుమారు రూ. 25 లక్షల వ్యయంతో రెంటచింతలలో ఇండోర్ స్టేడియం, మంచినీటి సౌకర్యం, బస్‌షెల్టర్, కల్యాణ మండపం వంటి పలు సేవా కార్యక్రమాలు చేపట్టి తాను పుట్టినగడ్డకు, గ్రామస్తులకు అండదండగా నిలిచారు. ప్రస్తుతం ఆయన స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానానికి చైర్మన్‌గా సేవలు అందిస్తున్నారు. తన ఎంపికకు కృషి చేసిన ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల యువజన విభాగం జోనల్ ఇంచార్జి పిన్నెల్లి వెంకటరామిరెడ్డిలకు సత్య వెంకటరామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తనపై పార్టీ పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు. పల్నాడు జిల్లా పార్టీ కార్యవర్గంలోకి రెంటచింతల గ్రామానికి చెందిన మర్రి లూర్దురాజును తీసుకున్నారు.

నేడు సత్రశాల దేవస్థానంలో వరదపాశం

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద వేంచేసిన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవస్థానంలోని స్వామివారికి శ్రావణమాసం సందర్భంగా సోమవారం భక్తులు, జెట్టిపాలెం గ్రామస్తులు వరదపాశం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బొద్దూరి బ్రహ్మారెడ్డి, ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 8 గం.లకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి దివ్య ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

ఘనంగా నిదానంపాటి అమ్మవారి తిరునాళ్ల

గురజాల : నిదానంపాటి అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో వేంచేసియున్న నిదానంపాటి అమ్మవారి దేవాలయంలో తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేకువ జాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

కార్డ్స్ సంస్థ సేవలు అభినందనీయం

వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి

పిడుగురాళ్ల: పేద వర్గాలకు విద్యను అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కార్డ్స్ సంస్థ విద్య వ్యాప్తి కోసమే బాలబాట ద్వారా దళిత పేద పిల్లలు కోసం చేస్తున్న కృషి అభినందనీయమని మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి అన్నారు. కార్డ్ సంస్థ ఆధ్వర్యంలో లెనిన్‌నగర్‌లో కార్డ్స్ స్కూల్‌లో ఏర్పాటు ఏసిన పేద విద్య అభివృద్ధి సామాజిక బాధ్యత అనే అంశం సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య ద్వారానే దళితులు పేద వర్గాలు ఆత్మ గౌరవంతో సమాజంలో జీవించడానికి విద్య అవసరమని తెలియజేశారు. కార్యక్రమంలో కార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ టి. అమర్‌నాథ్, మాజీ ప్రభుత్వ న్యాయవాది రుత్ బెనియన్, డాక్టర్ సుభాని, జాషువా కళా సమితి అధ్యక్షులు సీహెచ్ సంతోషరావు, కార్డ్స్ డీడీ సుబ్బారావు, బాలబాల ఏసీవో విజయకుమార్, దళిత సేవాదళ్ కోటి తదితరులు పాల్గొన్నారు.

రచయిత మాన్‌సింగ్ నాయక్‌కు సన్మానం



కారెంపూడి: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా కొండవీటి తెలుగు రచయితల సంఘం కారెంపూడి మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు రచయిత బాణావత్ మాన్‌సింగ్ నాయక్‌ను ఆదివారం సత్కరించారు. ఫిరంగిపురంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో మాన్‌సింగ్ నాయక్ తెలుగు భాష గొప్పదనం, గిడుగు వెంకట రామ్మూర్తి తెలుగు భాషకు చేసిన సేవలను వివరిస్తూ కవిత రూపంలో వినసొంపుగా ఆలపించినందుకు రచయితల సంఘం అధ్యక్షుడు సయ్యద్ మహమ్మద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ తోళ్లమడుగు గోవిందు తదితరులు మాన్‌సింగ్ నాయక్‌ను అలాగే మరో రచయిత షేక్ మహమ్మద్ రఫీలను సన్మానించారు.

నేటి నుంచి పాడి రైతులకు రుణమేళా

శావల్యాపురం: జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి అమూల్ పాల కేంద్రాల్లో పాల ఉత్పత్తిదారులకు రుణామేళా కార్యక్రమం జరుగుతుందని ఏంపీడీఓ పేరుమీనా సీతారామయ్య ఆదివారం తెలిపారు. అమూల్ పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతి కోసం ప్రభుత్వ ఒక్కో పాడిరైతుకు సొసైటీ బ్యాంకు తరపున రూ. 1.60లక్షలు రుణ సదుపాయం 7శాతం వడ్డీరేటుకు కల్పిస్తామన్నారు. రుణామేళా కార్యక్రమంలో మొదట రోజు వేల్పూరు-1, వేల్పూరు-2, పోట్లూరు గ్రామసచివాలయాల్లో, రెండవరోజు 29న శావల్యాపురం, కనమర్లపూడి, 30న గుంటుపాలెం, పిచికలపాలెం, 31న శానంపూడి, బొందిలిపాలెం, సెప్టెంబర్ 1వ తేదీన మతుకుమల్లి, కారుమంచి, 2న చినకంచర్ల గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల్లో జగనన్న పాలవెల్లువ రైతుల రిజిస్ట్రేషన్ నమోదు కార్యక్రమాలు అధికారులు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సమక్షంలో జరుగుతాయన్నారు. ఈరుణామేళా కార్యక్రమంలో పాల్గొనే రైతులు సొసైటీ బ్యాంకుఖాతా కల్గియుండాలని, ఆధార్, రూ. 100 నోటరీ ధ్రువీకరణ పత్రాలను రుణామేళా కార్యక్రమంలో పాల్గొనే అధికారులకు అందజేయాలన్నారు. పాడి రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవనోపాదులు పెంపుదల చేసుకోవాలన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మాచవరం: పొలంలోని ట్రాన్స్‌పార్మర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌నకు గురై యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన యామర్తి హనుమయ్య (38) ఇటీవల సాగునీరు నిమిత్తం తన సొంత పొలంలో బోరుబావికి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం పొలం వెళ్లి ట్రాన్స్‌పార్మర్‌కు పూజలు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్‌నకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం పిడుగురాళ్లకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తు, కుమార్తె ఉన్నారు.

విఫల ప్రధాని నరేంద్ర మోదీ

బస్సు యాత్రలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

నరసరావుపేట: బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో వెనుకబడిందని ప్రధాని నరేంద్ర మోదీ ఫెయిల్యూర్ పీఎం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. బస్సు యాత్రలో భాగంగా ఆదివారం నరసరావుపేటకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కేంద్రంలో మరోసారి నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే లౌకిక రాజ్యాన్ని కాలరాసి మనుస్మృతి ఆధారంగా రాజ్యాంగాన్ని రూపొందించి అమలు చేస్తారని అన్నారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో నరేంద్ర మోడీ మతం ఎజెండాగా వెళ్తున్నారని, ఆ పార్టీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. శాస్త్రవేత్తల కృషితో చంద్రయాన్-3 విజయవంతమైందని, చంద్రయాన్ ల్యాండ్ అయిన ప్రాంతానికి నరేంద్రమోదీ శివశక్తిగా నామకరణం చేయటం మతతత్వానికి పరాకాష్ట అన్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

దుర్గి: మండల పరిధిలోని కంచరగుంట గ్రామంలో ఆదివారం పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ. 17,200ల నగదును స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అదుపులోని వ్యక్తులను పూర్తిగా విచారణ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం శివ పేర్కొన్నారు.

నాలుగు గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తి

శావల్యాపురం: రీసర్వే పనులు తుది దశకు చేరినట్లు తహసీల్దార్ షేక్ జాన్‌సైదులు ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఏడు రెవెన్యూ గ్రామాలు ఉండగా మండల భూముల విస్తీర్ణం 36,680 ఎకరాలు ఉందని, అందులో 18,300 ఎకరాల్లో రీసర్వే పనులు పారదర్శకంగా చేశామన్నారు. ఇందుకుగాను మండలంలోని కనమర్లపూడి, పిచికలపాలెం, వేల్పూరు, పోట్లూరు రెవెన్యూ గ్రామాల పరిధిలో రీసర్వే పనులు నూరు శాతం పూర్తి అయినట్లు చెప్పారు. శానంపూడి రెవెన్యూ గ్రామపరిధిలో భూముల కొలతలు పూర్తయ్యాయని, ప్రస్తుతం రికార్డు పనులు జరుగుతున్నాయన్నారు. మండలంలోని కారుమంచి, కొత్తలూరు రెవెన్యూ గ్రామాల్లో ఓఆర్ఎస్ ఛాయాచిత్రాలు రాగానే రీసర్వే పనులు ప్రారంభిస్తామన్నారు. ఆయనతో పాటు డెప్యూటీ తహసీల్దార్ వేముల వెంకట భాస్కర్, ఆర్ఐలు పి.నాసరయ్య, చంద్రబాబులు ఉన్నారు.

రైతులు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి



దమ్మాలపాడులో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

ముప్పాళ్ళ: ఖరీఫ్ సీజన్‌లో భాగంగా సాగు చేసిన పంట వివరాలను ఈ-క్రాప్ లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ చెప్పారు. మండలంలోని దమ్మాలపాడు, ముప్పాళ్ళ, బొల్లవరం, గోళ్ళపాడు గ్రామాల్లో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఆదివారం పరిశీలించారు. ప్రతి రైతు తప్పనిసరిగా సాగు చేసిన పంట వివరాలను గ్రామంలోని వ్యవసాయశాఖ సిబ్బంది ద్వారా గాని, రెవెన్యూ సిబ్బంది ద్వారా గాని నమోదు చేసుకోవచ్చన్నారు. పట్టాదారు పాసుపుస్తకం తీసుకుని సిబ్బంది ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ విధానం వల్ల వాతావరణ పరిస్థితుల వల్ల పంటలు దెబ్బతింటే ప్రభుత్వం అందించే నష్టపరిహారం పొందవచ్చన్నారు. మార్కెట్‌లో పంటలకు గిట్టుబాటుధర లభించనప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల ద్వారా పంట ఉత్పత్తులను ప్రభుత్వం నిర్దేశించిన దరకు అమ్ముకోవచ్చన్నారు. కౌలు రైతులు కూడా కార్డు ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రైతులు పంటనమోదు ప్రక్రియకు సహకరించాలన్నారు.

ఈ క్రాఫ్‌తో రైతులకు ఎంతో మేలు

వ్యవసాయాధికారిణి సంధ్యారాణి

గురజాల : ఈ- క్రాఫ్ నమోదు చేసుకున్న రైతులకు పంట నష్టం జరిగితే ఇన్సూరెన్సు వర్తింస్తోందని వ్యవసాయాధికారిణి ఎం సంధ్యారాణి అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం అమ్మాలంటే ఈ-క్రాఫ్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. తప్పనిసరిగా రైతులు పండించిన పంటను ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యవసాయాధికారులకు సహకరించి విధిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు.

29న సరస్వతి శిశుమందిర్‌లో అష్టావధానం

సత్తెనపల్లి: స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో తెలుగు భాష దినోత్సవం సందర్భంగా ఈనెల 29న సాయంత్రం 5.30 గంటలకు పట్టణంలోని గుంటూరు రోడ్డులో గల శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో అష్టావధానం జరుగుతుందని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. అవగాహన సుధాకర, స్వర్ణకంకణ గ్రహీత, శతావధాని శ్రీమాన్ నారాయణ బాలసుబ్రమణ్యం హాజరవుతారన్నారు.


క్లుప్తంగా

అటెండర్ కోటయ్యకు సేవా చక్రవర్తి అవార్డు



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలంలోని చీకటీగలపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆవులమంద బాలకోటయ్యకు సేవా చక్రవర్తి అవార్డు లభించింది. బాలకోటయ్య చేసే స్వచ్ఛంద కార్యక్రమాలకు గాను విజయవాడకు చెందిన మానస సాహిత్య సాంస్కృతిక అకాడమీ ఈ అవార్డును ప్రకటించింది. విజయవాడలో జరిగిన అకాడమీ 22వ వార్షికోత్సవంలో కోటయ్యను అకాడమీ అధ్యక్షుడు సీహెచ్ వీఎస్ బ్రహ్మానందరావు, డాక్టర్ సమరం తదితరుల సత్కరించి అవార్డు అందజేశారు. కోటయ్యను పాఠశాల ప్రిన్సిపాల్ జి.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది, పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన కాకుమాను యోగేశ్వరరావు, శైలజ దంపతులు రూ.1,01,116లు విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో ఆదివారం దాత యోగేశ్వరరావు విరాళం మొత్తాన్ని ఈఓ టి.సుధాకరరెడ్డికి అందజేశారు. త్వరలో ప్రారంభించనున్న ఆలయ రాతి నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేసి సహకరించాలని ఈఓ కోరారు. శ్రావణమాస శుక్రవారం సందర్భంగా సెప్టెంబర్ 1వ తేదీన ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అమ్మవారి ఆలయానికి వెండి కిరీటం అందజేత



నరసరావుపేట ఈస్ట్: పాతూరులో వేంచేసియున్న గంగా పార్వతీ సమేత భీమలింగేశ్వర స్వామి ఆలయంలోని పార్వతీ అమ్మవారికి పట్టణానికి చెందిన గొడవర్తి అప్పారావు రెండున్నర కేజీల వెండి కిరీటం బహూకరించారు. ఆలయానికి ఆదివారం కుటుంబ సభ్యులతో వచ్చిన అప్పారావు వెండి కిరీటాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. గత 50సంవత్సరాలు ఆలయానికి విచ్చేస్తున్న అప్పారావు కుటుంబ సభ్యులు అమ్మవారికి కిరీటం అందించటంపై హర్షం వ్యక్తం చేశారు.

155 మందికి వైద్యపరీక్షలు



యడ్లపాడు: ఆహార, వ్యాయామాల నియమాలతోనే షుగర్, బీపీలను నియంత్రణలో ఉంచుకోవచ్చని వైద్యులు తెలిపారు. యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటీ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 155 మంది రోగులకు బీపీ, షుగర్ పరీక్షలను చేసి రెండు నెలలకు సరిపడా మందులను అందజేశారు. కార్యక్రమంలో ఆయా కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

యడ్లపాడు: మండలంలోని కొండవీడు గ్రామంలో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సంస్థ చైర్మన్ షేక్ జాన్‌సైదా ప్రారంభించారు. గ్రామస్తులతో పాటు సమీప ప్రాంతాల వారు పాల్గొనగా వైద్యులు వివిధ రకాల కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, బీవీ రెడ్డి, బోయపాలెం రసూల్, పట్నం కరిముల్ల, జిలానీ, కరీం, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు జరగాల్సిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు వాయిదా

సత్తెనపల్లి: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28, 29న జరగాల్సిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు వాయిదా పడినట్లు మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. తిరిగి ఈనెల 30, 31న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు యధావిధిగా జరుగుతాయన్నారు.

రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఆదర్శ పాఠశాల విద్యార్థినుల కిట్



మధ్యలో రూపొందించిన కోట్ దరించిన విద్యార్థితో ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు (ఫైల్)

కారెంపూడి: పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి యూనిసెఫ్ గ్రాండ్ ఫినాలేకు స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థినులు రూపొందిన కిట్ ఎంపికైంది. పాఠశాల 9వ తరగతి విద్యార్థినులు స్వాతి, మహాలక్ష్మి, సుమతి, శాంతిల బృందం రూపొందించిన ×హీట్ ప్రొటెక్టింగ్ కోట్ అండ్ హాట్ కిట్₹ రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. ఎండలో పనిచేసే కార్మికులు, రైతులు ఇతరులు ఈ కోట్ ధరించడం ద్వారా ఎండి వేడి నుంచి ఉపశమనం కలిగే విధంగా విద్యార్థినులు దీనిని రూపొందించారు. ఒక కోట్, హాట్ మాస్క్, ఒక జత గ్లౌస్‌లు ఇతర అందుబాటులో ఉండే వస్తువులతో విద్యార్థినులు దీనిని రూపొందించారు. కేవలం రూ.400 ఖర్చు చేసి విద్యార్థినులు ఈ కిట్ తయారు చేశారు. ఈ నెల 28 నుంచి 3 రోజుల పాటు విజయవాడలో జరగనున్న గ్రాండ్ ఫినాలేలో వారు రూపొందించిన కిట్‌ను ప్రదర్శించనున్నారు. ప్రిన్సిపల్ నయోమి ఆధ్వర్యంలో సైన్స్ ఉపాధ్యాయురాలు ప్రసన్న లక్ష్మి మార్గదర్శకంలో ఈ కిట్‌ను విద్యార్థినులు రూపొందించారు. వారు రూపొందించిన ప్రత్యేక కోట్, హ్యాట్ ధరిస్తే ఎండ తీవ్రత నుంచి రక్షణ పొంద వచ్చని తెలియజేస్తున్నారు. గ్రాండ్ ఫినాలేలో తమ ప్రదర్శనల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2,326 పాఠశాలల విద్యార్థులు తమ కిట్లతో రాష్ట్ర ప్రదర్శనలో పాల్గొనేందుకు వివిధ దశలలో పోటీ పడ్డారు. వారిలో కేవలం 28 పాఠశాలలు మాత్రమే రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. వాటిలో కారెంపూడి ఆదర్శ పాఠశాల ఒకటి.

గ్రామదేవతకు బోనాలు సమర్పణ



గన్నవరంలో గ్రామదేవతకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు

మాచర్ల రూరల్: సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండి గ్రామ ప్రజలంతా సిరిసంపదలతో మెలగాలంటూ గ్రామాల్లో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని గన్నవరం, ముత్యాలంపాడు, తాళ్ళపల్లి తదితర గ్రామాల్లో మహిళలు వేకువఝామున ఆయా గ్రామాల్లోని పోలేరమ్మ, ముత్యాలమ్మ, అంకాళమ్మ గ్రామ దేవతలకు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు పలువురు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి బోనాలు

మాచవరం: మండలంలోని ఆకురాజుపల్లి శివారులోని శ్రీఅభయ ఆంజనేయస్వామి దేవాలయ మార్గంలో వేంచేసియున్న శ్రీగంగమ తల్లి దేవాలయ పునఃనిర్మాణం పూర్వక సంప్రోక్షణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులచే యాగశాల ఏర్పాటు హోమాలు, పూజా కార్యక్రమాలు చేపట్టారు. కొత్తపాలెం గ్రామానికి చెందిన మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. పూజలు నిర్వహించి, విచ్చేసిన భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు

వాసవీ అమ్మవారి దేవాలయ అధ్యక్షుడిగా ఆత్మకూరి



ఆత్మకూరి పూర్ణ చంద్రరావు

మాచర్ల: పట్టణంలోని పాత మాచర్లలో వేంచేసియున్న శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి దేవాలయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఆత్మకూరి పూర్ణచంద్రరావు ఎన్నికయ్యారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య ప్రముఖుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ కూనిశెట్టి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ పోలా శ్రీను, పెద్దలు మారం వాసు, కొత్తమాసు బ్రహ్మారావు, చిల్లంచర్ల సత్యం, శ్రీలక్ష్మీ చెన్నకేశవ ట్రస్టు బోర్డు చైర్మన్ గోపవరపు నాగేశ్వరరావు, మేడం శెట్టి, రమణరావు, కంభంపాటి అనిల్‌కుమార్, పోలా పెద సత్యం, పోలా పెద ఆంజనేయులు, మహంకాళి శ్రీను, బచ్చు శ్రీను, జక్కా సుబ్బారావు, తుమ్మేపల్లి పెద అంకారావు, పోలిశెట్టి పిచ్చయ్య, ఆత్మకూరి సురేష్ తదితరులు పాల్గొని నిర్ణయం తీసుకున్నారు. తరువాత మిగతా కమిటీని ఎంపిక చేసినట్లు తెలిపారు. ముందుగా శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లయన్స్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన లయన్స్ క్లబ్ కమిటీ సభ్యులు

పిడుగురాళ్ల: లయన్స్ క్లబ్ (అక్షయ) మరింత సేవలను చేయాలని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అన్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఏర్పడినప్పటి నుంచి ప్రతి ఒక్కరికి ఏదో ఒక రకంగా సహాయం చేస్తూనే వస్తోందని, అలా సేవ చేయాలనే గుణం కూడా ఉండడం ఎంతో మంచిదని ఆయన తెలియజేశారు. నూతన కార్యవర్గం అధ్యక్షులుగా గుండా నారాయణరావు, కార్యదర్శిగా ఆవుల జనార్ధనరావు, కోశాధికారిగా కోడూరి కాశి శంకర్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గం పట్టణంలోని సాయి వృద్ధాశ్రమానికి రూ. 50,000 నగదును, ఫ్యాన్లును బహూకరించారు. 30 మంది విద్యార్థులకు ప్యాడులు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు.కార్యక్రమంలో క్లబ్‌సభ్యులు హాజరయ్యారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు.

తిమ్మాపురంలో త్రైతా సిద్ధాంతం ప్రచారం

యడ్లపాడు: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో భగద్గీత గ్రంథాలను ప్రచారం చేయడం జరిగింది. శ్రావణ మాసంలో వచ్చే శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం యొక్క అష్టమి తిథి జన్మరహస్యాన్ని తెలుసుకుంటే జ్ఞాన, అజ్ఞానాల వ్యత్యాసాలు తెలుస్తాయని సమితి ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధుల్లో తిరిగి త్రైత సిద్ధాంత భగవద్గీతలోని పరమార్థాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత -ప్రబోధ సేవాసమితి, పిడుగురాళ్లకు చెందిన ఇందూ జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షుడు కటికం సైదారావు, సభ్యులు కె.అరుణ, కోటేశ్వరరావు, నారాయణమ్మ, గోపీ, డి.శ్రీను, ఎం.వీరయ్య, ఎస్.వెంకటలక్ష్మి, సీహెచ్ అనురాధ, టి.రాఘవ, ఎం.అమర్, బి.చిరంజీవి, శివ, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

వాహన చట్ట సవరణతో రవాణా సిబ్బందిపై పెనుబారాలు

సత్తెనపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన వాహన చట్ట సవరణతో మోటార్ వాహనాల డ్రైవర్ల పై భారం మోపాయని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. శివాజీ అన్నారు. చేయూత ఆటో వర్కర్స్ యూనియన్ సిఐటియు పట్టణ మహాసభ స్థానిక సిఐటియు కార్యాలయంలో ఎస్ సైదేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారని, ఇన్సూరెన్స్ ప్రీమియం విపరీతంగా పెంచారని, రూ. 200 ఉన్న గ్రీన్ టాక్స్ రూ.20 వేలు వరకు వసూలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. రోడ్ టాక్స్ 30 శాతం పెంచారని, రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 21 ద్వారా అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు పెంచారని, చిన్న చిన్న పొరపాట్ల కు కూడా భారీ మొత్తంలో పెనాల్టీలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.